సాక్షి హనుమకొండ

బుధవారం | 26 | జూలై | 2023



ముంచెత్తుతున్న వరద..

తెలంగాణ, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

- 10లో▸



మహిళలకు రక్షణ కరువు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో మహిళలకు రక్షణ కరువైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు.

- 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $29^0/24^0$

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో ఉరుములు, మెరుపులతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

నిట్‌కు బాధ్యతగా సేవ చేయాలి



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకులు సాధించిన నిట్ విద్యార్థులు తమ కళాశాల రుణం తీర్చుకునేందుకు క్యాంపస్‌కు సేవ చేయాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. కాజీపేట నిట్‌లో మంగళవారం సివిల్ సర్వీసెస్ (యూపీఎస్సీ)–22లో ర్యాంకులు సాధించిన నిట్ విద్యార్థులకు నిట్ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ హాజరై ర్యాంకర్లను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటున్న నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి, కళాశాలకే గౌరవంగా నిలుస్తూ సివిల్ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. నిట్ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్‌లో రాణిస్తూ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. నిట్‌కు చెందిన ఆవుల సాయికృష్ణ ఏఐఆర్–94వ ర్యాంకు ఐఏఎస్, అచ్యుత్ అశోక్ 190వ ర్యాంకు ఐపీఎస్, ఎప్పలపల్లి సుస్మిత 384వ ర్యాంకు, మనోజ్ 559వ ర్యాంకు ఐఏఎస్, అనురాగ్ 524వ ర్యాంకు ఐఆర్‌ఎస్, తుమ్మల సాయికృష్ణారెడ్డి 640వ ర్యాంకు ఐఏఎస్, అభిజయ్ పగారే 844వ ర్యాంకు ఐసీఏఎస్‌లకు ఆన్‌లైన్‌లో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. యూపీఎస్సీలో 464వ ర్యాంకు సాధించి ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన సమీర్‌రాజును నిట్ డైరెక్టర్ ఘనంగా సన్మానించి, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో డీన్ ఐఆర్‌అండ్‌ఏఏ రామశేషు, నిట్ అల్యుమ్ని అసోసియేషన్ ప్రొఫెసర్లు వేణువినోద్, ఆనంద్ కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఆర్‌ఎంకు వినతి



కాజీపేట రూరల్: సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భరతేశ్‌కుమార్‌జైన్‌ను మంగళవారం ఆల్ ఇండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ, జోనల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్థపురం రాజశేఖర్, ప్రెసిడెంట్ బి.వీరన్న, అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ, కాజీపేట ఆపరేటింగ్ అండ్ కమర్షియల్ బ్రాంచ్ సెక్రటరీ కెఎన్.రావు, కాజీపేట ప్రెసిడెంట్ ఆర్.కుమారస్వామి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బి.మోతిలాల్, లోకో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ బి.మురళీకృష్ణ, వీరస్వామి కలిసి సన్మానించారు. రైల్వే ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలని, రైల్వేలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని వినతిపత్రం అందించినట్లు కేఎన్.రావు తెలిపారు.

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఎంబీఏ నాలుగో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) (2022–23) పరీక్షల ఫీజు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆగస్టు 5వ తేదీ వరకు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో ఆగస్టు 8వ తేదీతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని, రెగ్యులర్ విద్యార్థులు రూ.1,380 ఫీజు చెల్లించాలని సూచించారు. బ్యాక్‌లాగ్స్ రెండు పేపర్ల వరకు రూ.500, రెండు పేపర్లకు పైన రూ.950, ఇంప్రూవ్‌మెంట్ ప్రతీ పేపర్‌కు రూ.300ల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఎంజీఎం: జిల్లాలో ఆగస్టు 10న సామూహిక మాత్రాల (డీఈసీ) పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ సాంబశివరావు తెలిపారు. మంగళవారం వరంగల్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో.. బోదకాలు రాకుండా నివారించేందుకు డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ (మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్)పై ఐనవోలు, కడిపికొండ, కొండపర్తి పీహెచ్‌సీ, బోడగుట్ట యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సిబ్బందికి శిక్షణలో మాట్లాడుతూ.. రెండేళ్లకు పైబడిన వారికి ఒక్క డీఈసీ మాత్ర, ఆరు నుంచి 14 ఏళ్ల పైబడిన వారికి మూడు డీఈసీ మాత్రలు ఇవ్వాలని పేర్కొన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్, నాగయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పరకాల చలివాగు



పరకాలలో నీట మునిగిన పొలాలు



మత్తడి పోస్తున్న కమలాపూర్ మండలంలోని ఉప్పల్ చిన్న చెరువు



వాన జోరు.. వాగుల హోరు

దంచికొట్టిన వాన
- నిండు కుండలా చెరువులు, కుంటలు
- పెద్ద పెండ్యాలలో అధిక వర్షపాతం నమోదు





ముంపునకు గురైన హనుమకొండ జ్యోతిబసు కాలనీ, దామెర మండలంలో కొట్టుకుపోయిన ముస్త్యాలపల్లి–తక్కెళ్లపాడు గ్రామాల మధ్య రోడ్డు

హన్మకొండ/హన్మకొండఅర్బన్/పరకాల/శాయంపేట/దామెర/ఐనవోలు/నడికూడ: భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని మినహా చెరువులు, కుంటలు అలుగుదుంకుతున్నాయి. హనుమకొండ, కాజీపేటలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరి పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో కల్వర్టులపై నుంచి వరదనీరు పారింది. రోడ్లు కోతకు గురయ్యాయి. ఈ వర్షాకాలంలో హనుమకొండ జిల్లాలో అత్యంత భారీ వర్షం కురిసింది. జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 8 ప్రాంతాల్లో 10 నుంచి 18 సెంటి మీటర్లకు పైగా వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా పెద్ద పెండ్యాల ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో 18.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 10.35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పొంగుతున్న వాగులు

శాయంపేట, పరకాల మీదుగా ప్రవహించే చలివాగుతో పాటు జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. హనుమకొండలోని వడ్డేపల్లి చెరువు, వరంగల్‌లోని భద్రకాళి చెరువుతో పాటు జిల్లాలోని చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ముసురు వాన కురిసింది.

18 పునరావాస కేంద్రాలు.. 280 మందికి ఆశ్రయం

జిల్లాలో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సంబంధించి జరిగిన నష్టాన్ని జిల్లా యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేసింది. వర్షాలు, వరదలకు జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు, కాలనీల ప్రజలను ముందు జాగ్రత్త చర్యగా ప్రత్యేక పునరావాస కేంద్రాలకు తరలించారు. దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ పోల్స్ మరమ్మతులకు కలెక్టర్ సిక్తాపట్నాయక్ తక్షణ ఆదేశాలు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై అవసరం ఉన్న చోట ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చింది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం.. అధికారులు జిల్లా వ్యాప్తంగా 18 పునరావాస కేంద్రాలు, 280 మందికి ఆశ్రయం కల్పించారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ నష్టం జరగలేదు. హనుమకొండ మండలంలో 2, కాజీపేటలో 1, దామెరలో 1 మొత్తం నాలుగు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 11 కేవీ స్తంభాలు 6, ఎల్‌టీ లైన్లు పోల్స్ 23 దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు.

- చలివాగు చెక్‌డ్యామ్ మీదుగా ప్రవహిస్తున్న వరదతో సమీపంలోని పంటపొలాలు నీటమునిగాయి. వంతెనకు దాదాపు 5 ఫీట్ల కింది నుంచి వరద ప్రవహిస్తోంది. మొండివాగు వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో పరకాల నుంచి దమ్మన్నపేట వైపు వ్యవసాయ పనులకు రైతులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాగు ఒడ్డున ఉన్న వ్యవసాయ పంటలు, రైతులమోటార్లు నీటమునిగాయి.పరకాల పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో బొమ్మంటి ముత్యాలు, కుమారస్వామి, దిడ్డి ప్రమీల, బత్తిని పాణి, రాయరాకుల సమ్మయ్యకు చెందిన ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి.
- దామెర మండల కేంద్రంలోని గిద్దె చెరువు, ఊరుగొండ పెద్ద చెరువు, పసరగొండ చెరువులకు భారీగా వరదనీరు పోటెత్తడంతో మత్తడి పోస్తున్నాయి. ముస్త్యాలపల్లి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్ గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- ఐనవోలు మండల వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. నందనం గ్రామంలో నిర్మించిన బ్రిడ్జిని ఆనుకుని ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. గర్మిళ్లపెల్లిలో రాయిని చెరువు మత్తడి పడడంతో రోడ్డు కొట్టుకుపోయింది. కుంచం చెరువులోకి భారీగా నీరు చేరగా మత్తడి పడుతున్నప్పటికీ గండి పడే అవకాశం ఉన్నట్లు గ్రామస్తులు ఐబీ అధికారులకు సమాచారం అందించగా.. తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి మరమ్మతులు చేశారు. గర్మిళ్లపల్లి, ఐనవోలు నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు కంకర వరకు కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రోడ్లను పరిశీలించారు. వరంగల్ ఖమ్మం రహదారిపైకి భారీగా వరద నీరు చేరడంతో పంథిని గ్రామ శివారులో ఉదయం 5 గంటలనుంచి వాహనాలు నిలిచిపోయాయి. మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌లు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.
- నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ వాగు, నడికూడ మహ్మద్ షానాల మాటు వాగులు పొంగి పొరుతున్నాయి. కంఠాత్మకూర్ వాగు వరద నీరు రోడ్డు పైనుంచి ప్రవహించడంతో పరకాల–అంబాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వర్షపాతం (సెంటీ మీటర్లలో)

ఆత్మకూరు	17
కొండపర్తి	14.5
పరకాల	13.7
ఐనవోలు	13
దామెర	12.1
శాయంపేట	11.7
నడికూడ	10.7
భీమదేవరపల్లి	9.43
మడికొండ	8.98
వేలేరు	8.95
కాజీపేట	8.64
ఎల్కతుర్తి	8.33
పులుకుర్తి	8.15
పెద్దమ్మగడ్డ	7.95
హసన్‌పర్తి	7.25
కమలాపూర్	6.65
నాగారం	3.85



నందనం వద్ద బ్రిడ్జిని ఆనుకుని ఉధృతంగా ప్రహహిస్తున్న ఆకేరువాగు



మత్తడి పోస్తున్న పంథిని గ్రామ నర్సింహులకుంట చెరువు





గర్మిళ్లపల్లి, ఐనవోలు గ్రామాల మధ్య ధ్వంసమైన రోడ్డు, పంథిని వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆగిపోయిన వాహనాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేశ్

ఐనవోలు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ ఖమ్మం రహదారిపై మంగళవారం ఉదయం నుంచి వాహనాలు నిలిచిపోవడంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి పరిశీలించారు. కాగా.. రోడ్డుపైకి వరద వస్తున్న తీరును, స్థానిక పరిస్థితులను వార్డు సభ్యుడు కరిముల్ల పూర్ణచందర్‌ను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుపైకి నీరు చేరకుండా ప్రత్యామ్నాయ చర్యల గురించి ఆరా తీశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు.



ముల్కలగూడెం కొండపర్తి గ్రామాల మధ్య ధ్వంసమైన రోడ్డు

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

విద్యారణ్యపురి: జిల్లాలోని ఉర్దూ మీడియం విద్యార్థుల్లో భాషలో కనీస సామర్థ్యాలను పెంపొందించాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై కోరారు. హనుమకొండ జిల్లాలోని ఉర్దూ మీడియం పాఠశాలల టీచర్లకు పెట్రోల్ పంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండ్రోజుల నుంచి తొలిమెట్టు అమలుపై శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని అబ్దుల్‌హై తనిఖీ చేసి మాట్లాడుతూ.. పీరియడ్ ప్లాన్ హ్యాండ్‌బుక్స్, పాఠ్యపుస్తకం, వర్క్‌బుక్ ఉపయోగించుకుని ఉపాధ్యాయులు నూతన పద్ధతిలో బోధించాలన్నారు. తొలిమెట్టును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కమ్యునిటీ మొబలైజింగ్ కో– ఆర్డినేటర్ బి.రాధ, కోర్సు డైరెక్టర్, హెచ్‌ఎం పద్మావతి, రిసోర్స్‌పర్సన్లు అమీనా అక్తర్, సయ్యద్ మున్వర్ హుస్సేన్, అయేషా పర్వీన్, మహ్మద్‌నెహాస్ తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్షలు

హనుమకొండ జిల్లాలో 43 రోజులపాటు టీటీసీ టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలు నిర్వహించేందుకు టైంటేబుల్ విడుదల చేసినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆయా పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా ఈ టీటీసీ పరీక్షలకు హాజరు కావొచ్చని తెలిపారు. ఆగస్టు 12 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎడ్యుకేషనల్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్ ఆగస్టు 12న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే రోజు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్) సబ్జెక్ట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 3గంటల వరకు, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) సబ్జెక్టు మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు.

నేటి నుంచి శాలసిద్ధిపై శిక్షణ

హనుమకొండ జిల్లాలో ఎంపిక చేసిన 31 పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఈనెల 26, 27 తేదీల్లో రెండ్రోజులు హసన్‌పర్తి మండలం మిలీనియం పాఠశాలలో శాల సిద్ధి (ప్రమాణాలు, స్వీయ మూల్యాంకణ కార్యక్రమం)పై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 11 ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలను, 15 ప్రాథమిక పాఠశాలలను శాలసిద్ధికి ఎంపిక చేశారు. హైస్కూళ్లనుంచి ఒక హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లు, యూపీఎస్ నుంచి ఒక హెచ్‌ఎం, మరో టీచర్, ప్రాథమిక పాఠశాలల నుంచి ఒక హెచ్‌ఎం, ఒక టీచర్ చొప్పున ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలకు ఇప్పటికే సంబంధిత క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు, మండల రిసోర్స్ సెంటర్ల ద్వారా సమాచారం అందించారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇవ్వనున్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

నేడు, రేపు సెలవులు

వర్షాల కారణంగా బుధ, గురువారం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. హనుమకొండ జిల్లాలో టీచర్లకు తొలిమెట్టు శిక్షణా కార్యక్రమాలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని, ఎంపికైన ఉపాధ్యాయులు ఈశిక్షణకు హాజరుకావాలన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, యూఆర్‌ఎస్‌లలో బోధనా సిబ్బందికి సంబంధించి నియామకాల పరీక్షలు బుధవారం యథావిధిగా ఉంటాయని ఆయా అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు.

పిడుగుపాటుకు 20 గొర్రెల మృతి



ధర్మసాగర్: మండలంలోని ధర్మపురం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు పిడుగు పడి 20 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురం గ్రామానికి చెందిన మేకల సదయ్య తన 45 గొర్రెల మందను సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలోని కొట్టంలో కట్టేశాడు. ఈక్రమంలో పిడుగు పడడంతో 20 గొర్రెలు మృతి చెందాయి. రైతు ప్రథమ చికిత్స అందించి మరికొన్ని గొర్రెలను బతికించుకున్నాడు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ మునిగాల యాకుబ్ మాట్లాడుతూ.. సదయ్యకు సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

ఈడీసీ, ఎండీవీలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఆర్ఓ, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ డెమానిస్ట్రేషన్ సెంటర్ (ఈడీసీ), మొబైల్ డెమానిస్ట్రేషన్ వ్యాన్ (ఎండీవీ)పై ఓటర్లకు చైతన్యం కల్పించాలని వరంగల్ తూర్పు రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ), గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ఈడీసీలతో పాటు ప్రజల వద్దకే మొబైల్ డెమానిస్ట్రేషన్ వ్యాన్‌ను పంపనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎన్నికల డీటీ రవి వివిధ పార్టీల నాయకులు దాసరి రాజేశ్, మేకల రవి, ఎన్.వెంకటేశ్వర్లు, ఎరుకాల రఘునాథ్‌రెడ్డి, బి.శ్యాంసుందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో 700 మంది బాధితులు

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో సోమవారం రాత్రినుంచి మంగళవారం వరకు కురిసిన వర్షంతో పలు కాలనీలు నీట మునిగాయి. వరద నీటిలో మునిగిన పలు కాలనీల ప్రజలను బల్దియా ప్రజారోగ్యం, డీఆర్‌ఎఫ్ సిబ్బంది పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్ హంటర్ రోడ్డులోని ఎన్టీఆర్‌నగర్, సాయినగర్, బృందావన కాలనీ, గాయత్రినగర్‌కు చెందిన సుమారు 20 మందికి సమీపంలోని సంతోషిమాత గార్డెన్స్‌లో బస ఏర్పాటు చేశారు. రంగశాయిపేటలోని పలు కాలనీల ప్రజలను ఆగయ్య వినాయక గార్డెన్‌లో, కాశిబుగ్గకు సమీపంలోని మధురానగర్, లక్ష్మీ గణపతి, సాయినగర్, ఎస్ఆర్‌నగర్‌కు ప్రజలను వ్యవసాయ మార్కెట్‌లోని శుభం గార్డెన్‌లో, మైసయ్య నగర్‌కు చెందిన కాలనీ వాసులను ఏసీ రెడ్డి నగర్‌లోని కమ్యునిటీ హాల్‌కు చేర్చారు. వీరికి బల్దియా ప్రజారోగ్యం ఆధ్వర్యంలో భోజనం, తాగునీటి సదుపాయాలను కల్పించారు. అంతేకాకుండా బల్దియాకు చెందిన 27 మంది డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆర్‌ఎఫ్ఓ పాపయ్య, డీఎఫ్ఓ శంకర్ లింగం లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు బోట్ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు. రహదారులపై నేలకొరిగిన చెట్లను, ముళ్ల పొదలను తొలగించారు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న ప్రజలను మేయర్ సుధారాణి పరామర్శించి, ఓదార్చారు. వరద బాధితులకు అన్ని రకాలుగా సహాయక చర్యలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.



పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న బల్దియా ప్రజారోగ్యం సిబ్బంది

మీనం.. ఘనం..

● వేర్వేరు చోట్ల వలలకు చిక్కిన పెద్ద చేపలు

చిల్పూరులో 12 కిలోల పాపర చేప..



పాపర చేపతో లింగయ్య

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని ఆకేరు వాగు చెక్ డ్యాం వద్ద మంగళవారం సాయంత్రం 12 కిలోలు ఉన్న పాపర చేప వలకు చిక్కింది. గ్రామానికి చెందిన దామెర లింగయ్య చెక్‌డ్యాం వద్ద వల వేయగా ఈ చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చిన్నోడికి చిక్కిన పెద్ద చేప..



చేపను చూపుతున్న యశ్వంత్

చెన్నారావుపేట: చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువు మంగళవారం మత్తడి పోయగా ప్రజలు చేపల వేటకు వెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన రాకం యశ్వంత్ కూడా వెళ్లాడు. అక్కడ ఈ చిన్నోడి వలకు పెద్ద చేప చిక్కింది. దీంతో ఆ బుడతడి ఆనందానికి అవధులు లేకుండాపోయింది. మండల కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించాడు. 10 కిలోలు ఉండడంతో రూ. 1000 విక్రయించాడు. చిన్నోడికి అదృష్టం కలిసొచ్చిందని పలువురు చర్చించుకోవడం విశేషం.

జంగాలపల్లిలో 6 కిలోల వాలుగ..



వాలుగతో పవన్

ములుగు: ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో ములుగు మండలం మేడివాగు వద్ద ప్రజలు మంగళవారం చేపలు పట్టారు. ఇందులో జంగాలపల్లి గ్రామానికి చెందిన పవన్ వలకు 6 కిలోల వాలుగ చిక్కింది.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661



హన్మకొండ: మత్తడి పోస్తున్న భద్రకాళి చెరువు



కురవి : అలుగు పోస్తున్న నల్లెల్ల చెరువు



నర్సింహులపేట : కొమ్ములవంచలో మత్తడి పోస్తున్న కొత్త చెరువు

మత్తళ్లు..పరవళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో ఇంత కాలం నెర్రలు బారిన చెరువులు, కుంటలు మత్తళ్ల పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. కాగా, మత్తళ్ల వద్ద ప్రజలు చేపలు పడుతుండడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంటుంది.

\- సాక్షి నెట్‌వర్క్

ఉమ్మడి జిల్లాలో కుండపోత వర్షం..

- అలుగు పోస్తున్న చెరువులు, కుంటలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



కాజీపేట : సోమిడిలో పొంగిపొర్లుతున్న ఊర చెరువు



దేవరుప్పుల: మత్తడి పోస్తున్న కడవెండి వాగు



దామెర : మత్తడి పోస్తున్న దామెర గిద్దె చెరువు



నర్సంపేట రూరల్ : మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు



అలుగుపోస్తున్న మానుకోటలోని నిజాం చెరువు



గంగారం : గంగారంలో మత్తడిపోస్తున్న చెరువు



శాయంపేట : అలుగుపోస్తున్న చలివాగు



సంగెం : మత్తడి పోస్తున్న ఎల్గూర్‌రంగంపేట చెరువు



మహబూబాబాద్‌లోని జమండ్లపల్లి వద్ద మున్నేరు వాగు..



సంగెం : మత్తడి పోస్తున్న కుంటపల్లి చెరువు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, వరంగల్: వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, వరదలు, లోతట్టు ప్రాంతాల జలమయం, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో, రెస్క్యూ టీమ్స్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు తదితర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ఇతర అధికారులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పరిస్థితి, ముందు జాగ్రత్త చర్యలను కలెక్టర్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ఉందని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలపాలన్నారు. ఏ సమయంలో ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే, జిల్లా కలెక్టరేట్లలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కాగా, 2 రోజులుగా కురుస్తున్న వర్షాలపై ఆరా తీసిన మంత్రి.. అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఇదే సందర్భంలో తాను కూడా సహాయక చర్యలలో పాల్గొంటున్నానని, ప్రజాప్రతినిధులు, యువత కూడా అధికారులకు సహకరించాలని కోరారు.



ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

లైంగిక వేధింపులు..

● వివాహిత ఆత్మహత్య

వర్ధన్నపేట : లైంగిక వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు గ్రామానికి చెందిన పస్తం శ్రీనుకు 2006 సంవత్సరంలో మంజుల (34)తో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం 10 సంవత్సరాల క్రితం ముంబై వెళ్లిన దంపతులు.. మూడు నెలల క్రితం ఇంటికి చేరుకున్నారు. ఈక్రమంలో మండలంలోని ఎల్లికెట్ట గ్రామం టిక్యాతండాకు చెందిన జాటోత్ జితేందర్‌కు తమ ఇంట్లోని ఓ గదిని అద్దెకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జితేందర్ తరుచూ మంజులను లొంగదీసుకోవాలని యత్నించాడు. దీనిపై తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జితేందర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఆయనలో మార్పు రాకపోవడంతో మరోసారి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ వేధింపులు తాళ లేక మంజుల 15 రోజుల క్రితం తన సోదరి శారద ఇంటికి వెళ్లింది. అక్కడ మంజులకు మాయమాటలు చెప్పిన జితేందర్.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ లైంగిక దాడికి యత్నించడంతో మంజుల ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనలో లైంగిక వేధింపులు తట్టుకోలేక తన భార్య మంజుల ఆత్మహత్యకు పాల్పడిందని భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



మంజుల(ఫైల్)

మహిళ బలవన్మరణం

వరంగల్ క్రైం : భర్తతో పాటు కుటుంబ సభ్యుల వేధింపులతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేటలోని బొల్లెనవాడకు చెందిన జంగ్లీ నిఖిత (21) ఈనెల 24న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి యేసోబు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త మహ్మద్ హసనుద్దీన్, కుటుంబ సభ్యులు సుల్తానా, కమాలుద్దీన్, యాకూబ్‌పై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.



నిఖిత మృతదేహం

పోలీస్ అధికారుల బదిలీ

- ఇన్‌స్పెక్టర్లు 19 మంది.. సబ్ ఇన్‌స్పెక్టర్లు 14 మంది
- ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సీపీ ఏవీ. రంగనాథ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 19 ఇన్‌స్పెక్టర్లు, 14 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్పెక్టర్లు..

డి.మల్లేష్ ఇంతేజార్‌గంజ్ నుంచి శాయంపేట సర్కిల్, బి.శ్రీనివాస్‌రావు శాయంపేట సర్కిల్ నుంచి వీఆర్ వరంగల్, టి.సురేష్ ఖమ్మం కమిషనరేట్ నుంచి మిల్స్‌కాలనీ, ముస్కె శ్రీనివాస్ మిల్స్‌కాలనీ నుంచి ఇంతేజార్‌గంజ్, కె.శ్రీధర్‌రావు సీఎస్‌బీ వరంగల్ నుంచి ధర్మసాగర్, ఎ.రాఘవేందర్ స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సీఎస్‌బీ వరంగల్, సాట్ల రాజు వీఆర్ వరంగల్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, ఓ.రమేష్ ధర్మసాగర్ నుంచి సీసీఆర్‌బీ వరంగల్, అడవెల్లి శ్రీనివాస్ వీఆర్ వరంగల్ నుంచి రఘునాథపల్లి సర్కిల్, ఆర్.సంతోష్ రఘునాథపల్లి సర్కిల్ నుంచి వరంగల్ పోలీస్ కంట్రోల్ రూం, పి.కిషన్ వీఆర్ వరంగల్ నుంచి సీఎస్‌బీ వరంగల్, కె.కుమారస్వామి వీఆర్ వరంగల్ నుంచి సీసీఆర్‌బీ వరంగల్, కె.శ్రీనివాస్ టాస్క్‌ఫోర్స్ నుంచి వీఆర్ వరంగల్ ఐటీ సెల్, పెండ్యాల్ దేవేందర్ కమిషనరేట్ నుంచి టాస్క్‌ఫోర్స్, జి.రాజశేఖర్‌రెడ్డి సిద్దిపేట కమిషనరేట్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎల్.పవన్‌కుమార్ ఆదిలాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎస్.రవికుమార్ ఖమ్మం కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, భూక్య శంకర్ సీసీఎస్ వరంగల్, ఎస్.చంద్రమోహన్ వీఆర్ వరంగల్ నుంచి సైబర్ క్రైం లకు బదిలీ అయ్యారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లు..

మహేందర్ మామునూరు నుంచి జఫర్‌గఢ్, కె.శ్రవణ్‌కుమార్ కొత్తగూడెం జిల్లా నుంచి దేవరుప్పుల, ఎం.లింగారెడ్డి మహబూబాబాద్ జిల్లా నుంచి పాలకుర్తి ఎస్సై 2, టి.సుమన్ మిల్స్‌కాలనీ నుంచి సుబేదారి, ఎస్.డేవిడ్ వీఆర్ నుంచి హన్మకొండ ట్రాఫిక్, తొటం శ్రవణి మిల్స్‌కాలనీ నుంచి పోలీస్ కంట్రోల్‌రూం, బండి హరికృష్ణ మిల్స్‌కాలనీ నుంచి ఘన్‌పూర్, వడ్డె సందీప్ పీసీఆర్ నుంచి హన్మకొండ పీఎస్, అనిల్ పీసీఆర్ నుంచి కేయూసీ, రాజిరెడ్డి మట్టెవాడ నుంచి వీఆర్, మున్నీరుల్లా హన్మకొండ నుంచి వీఆర్ వరంగల్, రుక్మాచారి జనగామ నుంచి వీఆర్ వరంగల్‌కు బదిలీ చేస్తూ సీపీ ఏవీ. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

జనరల్ టికెట్‌తో రిజర్వేషన్ కోచ్‌లోకి..

● రైలులో ప్రయాణికుడి హల్‌చల్

కాజీపేట రూరల్: న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో మంగళవారం ఓ ప్రయాణికుడు హల్‌చల్ చేశాడు. ఆగ్రాలో జనరల్ టికెట్ తీసుకొని తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో ప్యాంట్రీ కార్ కోచ్‌లోకి ప్రవేశించాడు. రిజర్వేషన్ కోచ్‌లోకి వచ్చిన నేపథ్యంలో జరిమానా చెల్లించాలని టీటీఈలు పేర్కొనగా వారిపై తిరగబడి న్యూసెన్స్ చేశాడు. దీంతో టీటీఈలు పోలీస్ కంట్రోల్ సమాచారం ఇచ్చారు. రైలు కాజీపేట జంక్షన్‌కు చేరుకోగానే సదురు ప్రయాణికుడిని ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావుకు అప్పగించగా ఆయన పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నీరు వెళ్లే దారేది?



చిన్నవడ్డేపల్లి చెరువు మత్తడి వద్ద మూసి ఉన్న తూము....పైనుంచి పోతున్న వరద నీరు

- గుడిసెలు వేసి అడ్డుగా మట్టి పోసి
- అవుట్ ఫ్లో లేక..ముంపులోనే కాలనీలు..
- పనిచేయని తూములు..
- పట్టించుకోని అధికారులు

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సైడ్‌కాల్వలు, కల్వర్టులు, బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. రెండు వర్షాకాలాలు పోయినప్పటికి పనులు పూర్తి కాకపోవడంతో శివారు ప్రాంతమైన 14, 18వ డివిజన్‌లలో పలు కాలనీలు ఆదివారం నుంచి కురిసిన భారీ వర్షంతో జలమయమయ్యాయి.

గుడిసెలు వేసి.. అడ్డుగా మట్టి..

చిన్నవడ్డేపల్లి చెరువులో వామపక్ష పార్టీల అధ్వర్యంలో గుడిసెలు వేసిన వారు పై ప్రాంతాలనుంచి చెరువులోకి వచ్చే కాలువకు అడ్డంగా మట్టిపోయడంతో వర్షపు నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయింది. గత వారం కమిషనర్ వచ్చి అడ్డుగా ఉన్న మట్టి తీయాలని ఆదేశించగా తూతూమంత్రంగా తీయడంతో మళ్లీ నీరు నిలిచింది. దీనికి తోడుగా వరద వచ్చినప్పుడు అదనంగా నీరు పోయేందుకు మత్తడిపై రెండు తూములు ఏర్పాటు చేశారు. ఈ తూములను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక తూము పూర్తిగా మూసి ఉండడం కూడా కాలనీలు మునిగిపోయేందుకు కారణంగా భావిస్తున్నారు. ఒక తూము తీసినా పైనుంచి వచ్చే వరద మత్తడి పైనుంచి పోయింది. మరో తూము తీస్తే కాలనీలు మునక బారినుంచి బయటపడే అవకాశాలున్నాయి.

ఇన్‌ఫ్లో ఎక్కువ..అవుట్ ఫ్లో తక్కువ..

కాలనీల్లో పడిన నీరు పెద్ద మొత్తంలో బయటకు పోయే వీలు లేనందునే ముంపునకు గురువుతున్నాయి. నగరంలోని 18, 19, 14, 4వ డివిజన్లలో వర్షపు నీరు గరీబ్‌నగర్, 100ఫీట్లరోడ్డు, గాంధీనగర్, ఎస్ఆర్‌నగర్, లక్ష్మీగణపతికాలనీ, శ్రీసాయిగణేష్ కాలనీల మీదుగా చిన్నవడ్డేపల్లి చెరువులోకి వెళ్లాల్సి ఉంది. కానీ ఏనుమాముల రహదారి అడ్డంగా ఉండడం, నీరు వెళ్లేందుకు సరైన అవుట్ లెట్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్ల పై కాలనీలు అన్ని రోజుల తరబడి ముంపులోనే ఉంటున్నాయి. కాశిబుగ్గ–ఏనుమాముల ప్రధాన రహదారి మధ్యలో రెండు చోట్ల అవుట్‌లెట్‌లు నిర్మించాల్సి ఉండగా తాగునీటి పైపులైన్లు అడ్డుగా ఉన్న కారణంగా ఒకే చోట రెండు పైపులతో కల్వర్టులు నిర్మించినా వరద మాత్రం తగ్గలేదు. నాలుగు డివిజన్లలోని ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఒకేచోట నుంచి పోవడం వల్ల ఈపరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో నీరు చెరువులోకి పోకపోవడంతో పెట్రోల్‌బంకు వరకు వరద నిలిచిపోయింది.



మళ్లీ మునిగిన 14వ డివిజన్‌లోని లక్ష్మీగణపతి, మధురానగర్ కాలనీలు

పైపులు వేయడంలో నిర్లక్ష్యం..



ఏనుమాముల బాలాజీనగర్-నర్సంపేటరోడ్డు వరకు ఉన్న 100ఫీట్ల రోడ్డు మధ్యలో పరిచిన పైపులు

నర్సంపేట రోడ్డు నుంచి ఏనుమాముల బాలాజీ జంక్షన్ వరకు నిర్మించిన స్మార్ట్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం డ్రెయిన్ స్థానంలో పైపులు వేసేందుకు మార్పులు చేయించుకున్నాడు. పైపులు రోడ్డు మధ్యలో స్టాక్ పెట్టి 6నెలలు దాటింది. వాటిని వేయాలని చెప్పే ధైర్యం అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్ అధికార పార్టీ ఎమ్మెల్యేకు సోదరుడు కావడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఏరియా మరో ఎమ్మెల్యే పరిధిలో ఉన్నప్పటికి ఆయన కూడా చెప్పలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం ముంపు పరిశీలనకు వచ్చి మంత్రి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785632]

SERVICES

■మీ బంగారం తాకట్టులో ఉందా! వడ్డీ చెల్లించలేకపోతున్నారా! తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 7013501541 [H-788604]

LOANS

■సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785695]

WANTED

■మా సంస్థలో పనిచేయుటకు అనుభవం గల టెలికాలర్స్ మరియు అసోసియేట్ మెంబర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటీవ్స్ కలవు. సంప్ర॥ 9959567858. [W-189106]

■Wanted PRO's for Degree and MBA Admissions (College having more than 20 years Experience). Contact Cell: 9618722575. [WA-13200]

■ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221467]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.